


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
10-01-2025
పేజీలు: 02





# గేమ్ ఛేంజర్ రివ్యూ

ఈ సంక్రాంతి కానుకగా మన టాలీవుడ్ నుంచి వచ్చిన మొదటి పాన్ ఇండియా సినిమానే "గేమ్ ఛేంజర్". గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా మావెరిక్ దర్శకుడు శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా భారీ లెవెల్లో విడుదల అయ్యింది. మరి ఈ సినిమా అంచనాలు అందుకుందో లేదో రివ్యూలో చూద్దాం. ఇక కథ లోకి వస్తే.. అభ్యుదయం పార్టీ పేరిట ప్రస్తుత ఏపీలో బొబ్బిలి సత్య మూర్తి(శ్రీకాంత్) ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. కానీ తన కొడుకు అలాగే మంత్రి కూడా అయినటువంటి బొబ్బిలి మోపిదేవి(ఎస్ జే సూర్య) కి ఎప్పటి నుంచో ఆ సీఎం కుర్చీ పై కన్ను ఉంటుంది. ఈ నేపథ్యంలో అదే ఏపీకి కలెక్టర్ గా రామ్ నందన్(రామ్ చరణ్) వస్తాడు. మరి తనకి మోపిదేవికి జరిగిన యుద్ధం ఏంటి? ఈ క్రమంలో సత్యమూర్తి రామ్ నందన్ ని ఏపీ ముఖ్యమంత్రి గా ఎందుకు ప్రకటిస్తాడు? తను ముఖ్యమంత్రి అవుదాం అనుకున్న మోపిదేవి ఏం చేస్తాడు? ఇలా రామ్ నందన్ నడుమ మోపిదేవి నడుమ జరిగిన పొలిటికల్ వార్ ఎలా సాగింది? ఈ మొత్తానికి అభ్యుదయ పార్టీ అసలు స్థాపకుడు అప్పన్న(మరో రామ్ చరణ్) కి సంబంధం ఏంటి అనేవి తెలియాలి అంటే ఈ చిత్రాన్ని వెండితెరపై చూడాల్సిందే. ఈ సినిమా కోసం రామ్ చరణ్ అభిమానులే కాకుండా శంకర్ అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. మరి వారి అంచనాలుకి ఏమాత్రం తీసి పోని విధంగా ఉంటుంది అని చెప్పడంలో సందేహం లేదు. సినిమా విషయంలో శంకర్ చెప్పినట్టే ఆడియెన్స్ ని అటు ఇటు చూడకుండా ఆద్యంతం తెర వైపే చూసే సాలిడ్ మాస్ ఎలిమెంట్స్ తో క్రేజీ స్క్రీన్ ప్లే తో సినిమా పరుగులు పెడుతుంది. అలాగే సినిమాలో ఎలివేషన్స్ గాని కొన్ని ట్విస్ట్ బాగా ఎగ్జైట్ చేస్తాయి. ఇక వీటికి మించి శంకర్ మార్క్ కొన్ని కొత్త ఆలోచనలు, తన పొలిటికల్ రిలేటెడ్ సినిమాల్లో కనిపించే మాస్ సన్నివేశాలు తరహాలో ఇందులో కూడా ఉన్నాయి. ఇక నటీనటుల్లో అయితే మొట్ట మొదటిగా చెప్పాల్సింది రామ్ చరణ్ కోసమే.. శంకర్ సినిమాల్లో ముఖ్యం అయ్యిందనే ఆ ఎమోషన్స్. తన హీరోల నుంచి శంకర్ ఏ తరహా పెర్ఫామెన్స్ లని చూపించారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మరి గేమ్ ఛేంజర్ లో కూడా అన్ ప్రెడిక్టబుల్ గా రామ్ చరణ్ తన నటనతో షాకిచ్చాడు. డెఫినెట్ గా తన కెరీర్లో నిలిచిపోయే మరో ఐకానిక్ పెర్ఫార్మన్స్ ని తను అందించాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. 'రంగస్థలం' లో ఒక చిట్టిబాబు ఇప్పుడు గేమ్ ఛేంజర్ లో అప్పన్న అని చెప్పాల్సిందే. ఊహించని విధంగా తనలోని నటుడు ఆడియెన్స్ ని మెప్పిస్తాడు. అప్పన్న పాత్రలోని అమాయకత్వం ఆ పాత్ర కోసం తాను చూపించిన డెడికేషన్ కి ఖచ్చితంగా హ్యాట్సాఫ్ చెప్పి తీరాల్సిందే. ఇక రామ్ నందన్ గా కూడా స్టైలిష్ లుక్స్ లో అలాగే తన యంగ్ లుక్స్ లో చరణ్ ట్రీట్ ఇస్తాడు. సినిమాలో సందర్భానికి తగ్గట్టుగా తనలోని వేరియేషన్స్ అదిరిపోయాయి అంతే. ఇక సినిమాలో అంజలి కోసం చెప్పుకోవాలి. చరణ్ కెరీర్ లో ఆ పాత్రలు ఎలాగో అంజలి కెరీర్లో ఈ పాత్ర కూడా మిగిలిపోతుంది. తన రోల్ లో అద్భుతంగా అంజలి నటించారు. తనపై వచ్చే కొన్ని సన్నివేశాలు అయితే హృదయం కదిలేలా అనిపించక మానవు. ఇంకా విలన్ రోల్ లో చేసిన ఎస్ జే సూర్య తన మార్క్ విలనిజాన్ని చూపించారు. చరణ్ కి తనకి నడుమ కొన్ని హోరాహోరీగా సాగే సీన్స్ ఆడియెన్స్ కి మంచి ట్రీట్ ఇస్తాయి. అలాగే తన మ్యానరిజం, లుక్స్ తో తన పాత్రలో సాలిడ్ పెర్ఫార్మన్స్ ని తను అందించారు. ఇక నటుడు శ్రీకాంత్ కూడా మంచి రోల్ లో కనిపించారు. ఇంకా హీరోయిన్ కియారా అద్వానీ తన గ్లామర్ తో పాటుగా నటిగా కూడా సినిమాలో కీలక పాత్రలో కనిపించి అలరిస్తుంది. అలాగే సునీల్ నుంచి మళ్లీ చాలా కాలం తర్వాత చిన్నపాటి సహాయక పాత్ర కనిపిస్తుంది. ఇంకా కామెడీ బ్రహ్మ బ్రహ్మనందంపై ఉన్న ఒక కామెడీ సీన్ బాగుంది. జైరాం కామిక్ రోల్ లో అలరిస్తారు. సినిమాలో పాటలు, గ్రాండ్ విజువల్స్ మెస్మరైజ్ చేస్తాయి. అలాగే శంకర్ మార్క్ హార్డ్ హిట్టింగ్ ఎమోషన్స్ సినిమాలో పండాయి. అలాగే ఒక ఐఏఎస్ ఆఫీసర్ కి ఉండే పవర్స్ ఇంకా పొలిటికల్ గా పలు సీన్స్ ఫస్టాఫ్, సెకండాఫ్ లో చప్పట్లు కొట్టిస్తాయి. ఈ సినిమాలో సాలిడ్ నరేషన్ ఉంది కానీ ఈ తరహా కథలు కొత్తేమి కాదు. మన తెలుగు లోనే హీరో సాయి ధరమ్ తేజ్ పై వచ్చిన రిపబ్లిక్ లో జస్ట్ కొన్ని సన్నివేశాల తరహాలో ఇందులో తలపించవచ్చు. అలాగే ఫస్టాఫ్ లో మొదటి పది పదిహేను నిమిషాలు కొంచెం సో సో గానే ఉంటుంది. రామ్ చరణ్ పై ఇంట్రడక్షన్ ఫైట్ ని ఇంకా మెరుగ్గా ప్లాన్ చేసి ఉంటే బాగుండేది. అలాగే జరగండి సాంగ్ విజువల్స్ వీఎఫ్ఎక్స్ వరకు సినిమాలో బాగలేవు. ఆ సాంగ్ కి థమన్, ఎస్ జె సూర్య చాలా హైప్ ఇచ్చారు కానీ ఆ రేంజ్ లో లేదు. ఇంకా



సెకండాఫ్ లో కొన్ని సన్నివేశాలు అక్కడక్కడా లైట్ గా రొటీన్ అనిపించవచ్చు. వీటితో పాటుగా అప్పన్న పాత్రని ఇంకొంచెం సేపు చూపించినా బాగుండు అనిపిస్తుంది. ఇంకా శంకర్ మార్క్ స్టైలిష్ యాక్షన్ టేకింగ్ కూడా సినిమాలో మిస్ అయ్యినట్టు తన ఫ్యాన్స్ కి అనిపించవచ్చు. ఈ సినిమాలో దిల్ రాజు పెట్టిన ఖర్చు అంతా కనిపిస్తుంది. నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి.
అయితే వీఎఫ్ఎక్స్ లో ఇంకా బెటర్ గా చేయాల్సింది. జరగండి సాంగ్ థియేటర్స్ లో డిజప్పాయింట్ చేస్తుంది. మిగతా అన్ని పాటలు మాత్రం శంకర్ స్టాండర్డ్స్ కి తగ్గ లెవెల్లో క్రేజీ థాట్స్ తో ఉన్నాయి. థమన్ పై చాలా మందికి డౌట్స్ ఉండొచ్చు కానీ డెఫినెట్ గా శంకర్ స్టాండర్డ్స్ కి తగ్గట్టుగా ఇచ్చాడు. ఎలివేషన్స్ స్కోర్ మాత్రమే కాకుండా ఒక పిల్లనగ్రోవి ఎమోషనల్ బిట్ అయితే సినిమాలో కదిలిస్తాయి. ఎడిటింగ్ బాగుంది. తిరు సినిమాటోగ్రఫీ రిచ్ గా గ్రాండ్ విజువల్స్ తో బాగుంది. నానా హైరానా కూడా పెట్టి ఉంటే బాగుండేది. ఇక దర్శకుడు శంకర్ విషయానికి వస్తే.. గత కొన్నాళ్ల నుంచి తన ఫ్యాన్స్ ఏం కోరుకుంటున్నారో దానిని చూపించే ప్రయత్నంలో సక్సెస్ అయ్యారు. కథ కార్తిక్ సుబ్బరాజ్ ది అయినప్పటికీ తన మార్క్ కథనం, బలమైన ఎమోషన్స్ తో నడిపిన విధానం బాగుంది. ప్రతీ నటీనటులు నుంచి బెస్ట్ ని తను రాబట్టారు. స్క్రీన్ ప్లే నడిపిన విధానం సినిమాలో ఎంగేజ్ చేస్తుంది. ఓవరాల్ గా తన వర్క్ సినిమాకి బాగుంది. ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ "గేమ్ ఛేంజర్" కొంచెం ప్రిడక్టబుల్ మరికొంచెం ఎక్కువ అన్ ప్రిడక్టబుల్ సాలిడ్ ఎమోషన్స్ తో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా అని చెప్పవచ్చు. తన కెరీర్లో మరోసారి రామ్ చరణ్ తనలోని నటుడితో మెప్పిస్తాడు. ఖచ్చితంగా చిట్టిబాబు తర్వాత అప్పన్నగా ఆడియెన్స్ కి గుర్తుండిపోతాడు. నిజానికి తనపై సినిమాలో ఇంకా ఎక్కువసేపు సన్నివేశాలు ఉన్నా బాగుణ్ణు అనిపిస్తుంది. తను సహా ఇతర ప్రధాన తారాగణం సినిమాలో బాగా చేసారు. కదిలించే ఎమోషన్స్ మాంచి మాస్ మసాలా పొలిటికల్ సీన్స్ సినిమాలో ఆడియెన్స్ ని ఎంగేజ్ చేస్తాయి. అయితే కొంచెం రొటీన్ కథ, కొన్ని చోట్ల ఓకే అనిపించే సీన్స్ ఇందులో కనిపిస్తాయి. సో ఇవి పక్కన పెడితే ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు.



## లిక్కర్ కంపెనీలకు, ప్రభుత్వానికి సంబంధమేంటి?

పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో యూబీ కంపెనీ మద్యం సరఫరా నిలిపివేసిన విషయం తెలిసిందే. లిక్కర్ కంపెనీలు తమ బ్రాండ్లను నేరుగా దుకాణాలకు సరఫరా చేయలేవు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే డిపోలకు మాత్రమే పంపాలి. డిపోల నుంచి రిటైల్ వ్యాపారులకు మద్యం చేరుతుంది. కంపెనీలు డబ్బుల కోసం పూర్తిగా ప్రభుత్వం పైనే ఆధారపడాలి. అటు వినియోగదారుడు కొనే బీరు ధరలో 16% తయారీ ఖర్చు ఉండగా 70% ప్రభుత్వ పన్నులే ఉంటాయి.



## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య 'బ్లాక్ బ్యాగ్' విమర్శలు!

'పదేళ్ల నుంచి దుమ్ము పట్టిన ఒక నల్ల బ్యాగు ఏసీబీ ఆఫీసులో ఉంది. ఈ బ్యాగ్ ఎవరిదో చెప్పకోండి' అంటూ బీఆర్ఎస్ ట్వీట్ చేసింది. దీనిపై స్పందించిన టీ కాంగ్రెస్ 'ఆ నల్ల బ్యాగులో 2014 నుంచి మీరు చేసిన పాపాల చిట్టా ఉంది. ఆ బ్యాగును చూసి తెల్లమొహం వేసుకున్నాడా కేటీఆర్? బీఆర్ఎస్ దోపిడీ దొంగల అవినీతి వివరాలను నింపడానికి ఆ బ్యాగు సరిపోదు. కేటీఆర్ఎస్ విచారణకు వెళ్లిన ప్రతిసారి బ్యాగులను లెక్కించమని చెప్పండి' అని కౌంటర్ ఇచ్చింది.




## సంక్రాంతి బస్సులపై ఇక్కడిలా.. అక్కడలా!

సంక్రాంతికి APSRTC 7,200, TGSRTC 6,432 బస్సులు నడుపుతున్నాయి. అయితే ఏపీ ప్రభుత్వం స్పెషల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేయట్లేదని స్పష్టం చేసింది. ప్రైవేట్ బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే ఉండేలా చర్యలు తీసుకుంటామంది. అటు, TGSRTC స్పెషల్ సర్వీసుల్లో 50% వరకు అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ప్రకటించడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీ సర్వీసుల వైపే మొగ్గుచూపే అవకాశం ఉంది.



## ఈ ముగ్గురిలో కీపర్‌గా ఎవరైతే బాగుంటుంది?

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ ఇండియాలో ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది. KL రాహుల్, పంత్, శాంసన్‌లు పోటీలో ఉన్నారు. వీరిలో ఇద్దరికి స్క్వాడ్‌లో చోటు దక్కే ఛాన్సుంది. ODIల్లో KL 77 మ్యాచుల్లో 49.15 avgతో 2,851 రన్స్ చేయగా, పంత్ 31 మ్యాచుల్లో 871 (33.50), శాంసన్ 16 మ్యాచుల్లో 510 (56.66) పరుగులు చేశారు. వీరిలో ఎవరిని తుది జట్టులో ఆడిస్తే బాగుంటుంది?

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## ఏపీ హైకోర్టులో చెవిరెడ్డికి షాక్

మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి హైకోర్టులో షాక్ తగిలింది. ఫోక్సో కేసులో చెవిరెడ్డి వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. బాలికపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యేపై తిరుపతి పోలీసులు ఫోక్సో కేసు పెట్టారు. తిరపతిలో నమోదైన ఫోక్సో కేసుకు సంబంధించి ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఏపీ హైకోర్టును చెవిరెడ్డి ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం చెవిరెడ్డి పిటిషన్‌పై ఈరోజు (శుక్రవారం) హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ముందుస్తు బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. ఓ బాలికపై చెవిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, అది రుజువు కావడంతో తిరుపతి పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. ఆ తరువాత అటువంటి వ్యాఖ్యలు చేయలేదని బాలిక తండ్రి చెప్పినప్పటికీ అంతకుముందు ఆయన ఇచ్చిన వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్న పోలీసులు చెవిరెడ్డిపై ఫోక్సో కేసు పెట్టారు. ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని, ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని, అలాంటి వ్యాఖ్యలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే కోర్టులో ముందుస్తు బెయిల్ పిటిషన్ వేశారు. ఆయన తరపున న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈరోజు ఉదయం తీర్పు ఇచ్చిన హైకోర్టు.. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.



## ఉత్తరాదిన దట్టమైన పొగమంచు.. ఆరు వాహనాలు ఢీ

చలి తీవ్రతకు ఉత్తరభారతం వణుకుతోంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు యూపీ, పంజాబ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. ఆయా ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో పొగమంచు కారణంగా ఢిల్లీ — లఖ్‌నవూ జాతీయ రహదారిపై అరడజనుకుపైగా వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. శుక్రవారం ఉదయం ఢిల్లీ — ఎన్సీఆర్ ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఫలితంగా దృశ్యమానత దారుణంగా పడిపోయింది. కొన్ని ఏరియాల్లో విజిబిలిటీ జీరోగా నమోదైంది. ఈ కారణంగా ముందు వెళ్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. ఫలితంగా ఇవాళ ఉదయం ఢిల్లీ — లఖ్‌నవూ జాతీయ రహదారిపై ఆరుకుపైగా కార్లు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆ కార్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం. ఆ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రంగంలోకి దిగిన అధికారులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## ఒక నెల కరెంటు బిల్లు రూ. 2,10,42,08,405



సాధారణంగా కరెంటు బిల్లు ఎంత వస్తుంది.. నెలకు రూ.500 నుంచి రూ.1000 లోపు వస్తుంది. అదే ఏదైనా షాపో, హోటలో, ఫ్యాక్టరీ వంటి వాటికి రూ.5వేల వరకూ రావొచ్చు. అయితే, ఓ వ్యక్తికి ఒక నెల బిల్లు ఏకంగా రూ.200 కోట్లు వచ్చింది. ఇది చూసిన సదరు వ్యక్తి ఒక్కసారిగా షాక్ అయ్యాడు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. హమీర్‌పూర్ జిల్లాలోని బెహెర్విన్ జట్టన్ గ్రామానికి చెందిన లలిత్ ధీమాన్.. ఓ వ్యాపారవేత్త. అతడికి డిసెంబర్ 2024కి సంబంధించిన కరెంటు బిల్లు రూ.2,10,42,08,405 వచ్చింది. ఈ బిల్లు చూసి అతడు ఒక్కసారిగా షాక్ అయ్యాడు. అంతకు ముందు నెల కేవలం రూ.2,500 మాత్రమే కరెంటు బిల్లు చెల్లించాడు. ఇంతలోనే ఇంత మొత్తంలో బిల్లు చూసి అతడికి ఏం చేయాలో అర్థం కాలేదు. ఈ విషయంపై వెంటనే విద్యుత్ బోర్డు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదును పరిశీలించగా.. సాంకేతిక లోపం కారణంగా అధిక విద్యుత్ బిల్లు వచ్చినట్లు గుర్తించారు. డిసెంబర్ నెల కరెంట్ బిల్లు రూ.4,047గా తెలిపారు. దీంతో అతడు ఊపిరిపీల్చుకున్నాడు.

## ఇంట్లో ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురి హత్య

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో దారుణం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు హత్యకు గురయ్యారు. భర్త, భార్య, ముగ్గురు కుమార్తెలు దారుణంగా హత్యకు గురైనట్లు పోలీసులు వెల్లడించారు. లిసారి గేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని సోహెల్ గార్డెన్‌లో ఈ విషాద ఘటన జరిగింది. ఇంట్లోనే అయిదుగురి మృతదేహాలను వెలికితీశారు. భర్త మొయిన్, భార్య అస్మా.. మృతదేహాలు ఇంటి ఫ్లోర్‌పై ఉన్నాయి. ఇక ముగ్గురు కుమార్తెల మృతదేహాలు.. ఓ బెడ్‌లో దాచిపెట్టినట్లు గుర్తించారు. పిల్లల శవాలను మంచంలో దాచి పెట్టి.. వారి ఆచూకీ తెలియకుండా చేసే ప్రయత్నం జరిగినట్లు తెలుస్తోంది. మర్డర్ గురించి తెలుసుకున్న పోలీసులు.. ఫోరెన్సిక్ బృందాలు ఆ ఇంటికి చేరుకున్నారు. ఇంటిని కార్డెన్ చేసి, సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. క్రైం సీన్‌ను చాలా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఒకేసారి అయిదుగురు కుటుంబసభ్యుల్ని చంపడం వెనుక ఉన్న మిస్టరీని చేధించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటనతో స్థానిక ప్రజలు షాక్‌లోకి వెళ్లారు. చాలా శాంతియుతంగా ఉండే ప్రాంతంలో ఇలాంటి హేయమైన ఘటన ఎలా జరిగిందని భావిస్తున్నారు. మేస్త్రీగా పనిచేస్తున్న మొయిన్ కుటుంబాన్ని ఎవరు టార్గెట్ చేసి ఉంటారని ఆరా తీస్తున్నారు. మర్డర్‌కు చెందిన ఎటువంటి సమాచారం ఉన్నా తమతో పంచుకోవాలని పోలీసులు కోరారు.



## హాట్ లుక్స్‌లో భాగ్యశ్రీ

ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ డైరెక్షన్‌లో టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మాతలుగా మాస్ మహారాజ్ రవితేజ హీరోగా ఓ చిత్రం రూపొందుతున్నది. చాలా ఏళ్ల తర్వాత రవితేజ, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో సినిమా రావడం అభిమానుల్లో ఉత్సాహం రేకెత్తించేలా చేసింది. అయితే రవితేజ సరసన ఓ బాలీవుడ్ భామను ఎంపిక చేసినట్టు ప్రకటించిన వార్త వైరల్ అయింది. ఆ భామ ఎవరు? ఆమె కెరీర్ ఎలా ఉందనే విషయంలోకి వెళితే.. రవితేజ నటించే సినిమా కోసం భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేశారు. మోడల్, యువ హీరోయిన్‌గా రాణిస్తున్న ఈ సినిమా ద్వారా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెడుతున్నది. హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు ప్రకటించడానికి ముందు భాగ్యశ్రీ నాభి అందాలను బహిర్గతం చేస్తూ రవితేజ వాటేసుకొన్నట్టు చూపించారు. ఆ తర్వాత ఆమె ఫోటోను విడుదల చేశారు.

## ముక్కోటి పర్వదినం.. యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తజనం



యాదగిరిగుట్టలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా యాదగిరి లక్ష్మీనరసింహా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నారు. ఉదయం 5:15 నిమిషాలకు గరుడ వాహనంపై యాదగిరీశుడు ఉత్తరద్వార దర్శన మిచ్చారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్షపుష్పార్చన, ఆర్జిత సేవలు రద్దు చేశారు. అలాగే నేటి నుంచి ఈ నెల 15 వరకు యాదగిరిగుట్టలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. 6 రోజుల పాటు అలంకార సేవల్లో లక్ష్మీనరసింహా స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు.



## రేపట్నుంచి సంక్రాంతి సెలవులు..

**18న పునఃప్రారంభం**

తెలంగాణలో సంక్రాంతి పండుగ హడావుడి మొదలైంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఇవాళ ఘనంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఎందుకంటే రేపట్నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు కాబట్టి. స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పాఠశాలలకు వెళ్లారు.రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలలకు జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. 18వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి.

## L&T చైర్మన్‌కి క్లాస్ పీకిన గుత్తా జ్వాల



దేశంలో ప్రతిష్ఠాత్మక సంస్థ అయిన L&Tకి మంచి పేరుంది. గౌరవనీయమైన స్థానం ఉంది. కానీ ఆ సంస్థ చైర్మన్ S.N. సుబ్రహ్మణ్యన్ వివాదాస్పదన వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులకు ఆదివారాలు వద్దే వద్దు అంటున్నారు. దేశంలో ఒకవైపు వారానికి ఐదురోజుల పనిదినాల కల్చర్ వస్తోంది. అంటే వారానికి రెండు వీక్లీ ఆఫ్‌లు అన్నమాట. రెండు కాదు కదా, ఒక వీక్లీ ఆఫ్ కూడా ఎందుకన్నది ఆయన వాదన శనివారం నాడు కూడా ఉద్యోగులను పనిచేయాలని ఎందుకు అడుగుతున్నారు అని ఆ సంస్థ చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ సుమీత్ ఛటర్జీ ఆయన్ను అడిగారు. దీనికి L&T చైర్మన్ చెప్పిన సమాధానం షాకింగ్‌గా ఉంది. ఆదివారాలు ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు? భార్యల ముఖాలు ఎంతకని చూస్తారు అని L&T చైర్మన్ సుబ్రహ్మణ్యన్ ఎదురు ప్రశ్నించారు. పనిగంటల గురించి కొన్నినెలల కిందట పెద్దదుమారం రేగింది. వారానికి 70 గంటల పనిదినాలు కావాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అంటేనే దుమారం రేగింది. కానీ L&T చీఫ్ సుబ్రహ్మణ్యన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఈ అగ్గిని రాజేశాయి. ఆయన చెప్పిన ప్రకారం ఉద్యోగులు వారమంతా పనిచేయాలి. ఆదివారాలు కూడా వీక్లీ ఆఫ్‌లు ఉండొద్దు. అంటే రోజుకు 12 గంటల 8 నిమిషాలు పనిచేయాలి.. L&T చైర్మన్ గొడ్డుచాకిరీ ఆలోచనా విధానంపై విమర్శలు వస్తున్నాయి. బాలీవుడ్ నటి దీపికా పదుకోన్ స్పందించారు. ఇలాంటి సీనియర్ పొజిషన్లలో ఉన్న వ్యక్తులు ఇంత దారుణంగా మాట్లాడటం షాకింగ్‌గా ఉందని ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అటు స్పోర్ట్స్ స్టార్ గుత్తాజ్వాల కూడా సుబ్రహ్మణ్యన్‌పై మండిపడ్డారు. ముందు ఆయన తన భార్య ముఖాన్ని ఎందుకు చూడకూడదని అనుకుంటున్నారని ప్రశ్నించారు. కేవలం ఆదివారం మాత్రమే ఆయన తన భార్యను ఎందుకు చూడాలని అనుకుంటున్నారు అని ఆమె ట్వీట్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలతో కొందరు వ్యక్తులు- మహిళలపై తమ ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని గుత్తా జ్వాల మండిపడ్డారు. ఇలాంటి ఉన్నత స్థానాల్లో ఉన్న పెద్ద వ్యక్తులు మానసిక ఆరోగ్యం, మానసిక విశ్రాంతిని పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు.